# కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు!

- ఎస్సీ సెల్ నూతన కార్యవర్గంపై కసరత్తు
- ఈ నెల 15 వరకు దరఖాస్తులకు గడువు
- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, మే 12 (జనం పవర్):** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన కార్యవర్గ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా అబ్జర్వర్ రాజ బద్రయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగానే ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్మల తెలిపారు.

### కమిటీల ఎంపికపై కసరత్తు

మంత్రి దామోదర రాజనర్సింహా, జగ్గారెడ్డి, సురేష్ షేట్కార్ వంటి జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల సలహాలు, సూచనలతో నూతన కమిటీ ఎంపిక ఉంటుందని నిర్మలా జగ్గారెడ్డి వెల్లడించారు. అర్హులైన కార్యకర్తలు ఈ నెల 15వ తేదీ లోపు తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, జిల్లా నాయకుడు చిద్రుప్ప రఘు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హనుమంతు యాదగిరి, ఉపాధ్యక్షుడు గంగేరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ సెల్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# నియోజకవర్గ ఇంచార్జికి వివాహ ఆహ్వానం

**మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు**

**వధూవరులకు ముందస్తు శుభాకాంక్షలు**

**సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణను ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. జిల్లా ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు వాహబ్ బృందం కలిసి ఆతిక్ సోదరుని వివాహ శుభలేఖను హరికృష్ణకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్, సీనియర్ నాయకులు కలీముద్దీన్ అహ్మద్ పాల్గొన్నారు. వీరితో పాటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గాయశుద్దీన్ అహ్మద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రషద్, రామంచ సర్పంచ్ ఎర్ర నవీన్ తదితరులు హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలు వివాహ వేడుకకు రావాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా చర్చించారు.

# కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి

**కోహెడ, మే 12 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ పరిధిలోని ముతన్నపేటలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతుకు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ముతన్నపేట ప్రాంతంలో విద్యుత్ ఎర్త్ తీగలకు కరెంట్ సరఫరా కావడంతో మేత మేస్తున్న గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం దగ్గరకు వెళ్లింది. అక్కడ ఎర్త్ వైరును తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించి గేదె కుప్పకూలిపోయింది. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. మృతి చెందిన గేదె విలువ సుమారు 80 వేల రూపాయలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. పాడి గేదెపైనే ఆధారపడి జీవిస్తున్న ఆ కుటుంబానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో వాలిపోయిన తీగలను వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రైతుకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ప్రాణనష్టం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



# నేరస్థులపై ఉక్కుపాదం!

- అసాంఘిక శక్తులపై నిఘా నీడ
- పది మంది నేరస్థులపై బైండోవర్
- ఎస్సై ఉదయ్ కిరణ్



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. సమాజంలో అలజడి సృష్టించే శక్తులు పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ వెల్లడించారు. ఈ క్రమంలో మంగళవారం మండల పరిధిలోని పలువురు నేర చరిత్ర కలిగిన వ్యక్తులు రౌడీ షీటర్లు అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

### నేర ప్రవృత్తి వీడాల్సిందే

గతంలో పలు నేరాలకు పాల్పడిన వారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్న అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తిని వీడి సాధారణ జీవితం గడపాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని గట్టిగా హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడంలో భాగంగా అలవాటుగా నేరాలకు పాల్పడే 10 మందిని గుర్తించి వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు.




### చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు

భవిష్యత్తులో ఎటువంటి గొడవలు దాడులకు పాల్పడబోమని నిందితుల నుంచి హామీ తీసుకుంటూ బైండోవర్ ఉత్తర్వులు జారీ చేశారు. సమాజంలో భయోత్పాతాన్ని సృష్టించే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేశారు. బెదిరింపులకు పాల్పడినా అక్రమ దందాలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ చర్యల పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అగ్నిప్రమాదం!

**షార్ట్ సర్క్యూట్ తో చెలరేగిన మంటలు.. తప్పిన ప్రాణాపాయం**

**సంగారెడ్డి, మే 12 (జనం పవర్ ):** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఈడీ రామాచారి ఛాంబర్‌లో ఉన్న జిరాక్స్ మిషన్, కుర్చీలు, ఏసీ పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉన్నప్పటికీ అప్రమత్తమైన సిబ్బంది వెంటనే స్పందించి నీళ్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనతో కార్యాలయంలోని సామగ్రికి గణనీయమైన నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిప్రమాదానికి కారణమైన షార్ట్ సర్క్యూట్‌పై అధికారులు విచారణ చేపట్టనున్నారు. విద్యుత్ వైరింగ్‌లో లోపాల వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

# కాంగ్రెస్ పార్టీ నుంచి గౌరీ శ్రీధర్ రెడ్డి సస్పెన్షన్

**నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే వేటే**

**సొంత పార్టీ నేతలపై విమర్శలే కారణం**



**కొండాపూర్, మే 12 (జనం పవర్):** కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మౌనిక భర్త గౌరీ శ్రీధర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రకటించారు. మంగళవారం మల్కాపూర్ గ్రామ శివారులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. శ్రీధర్ రెడ్డి పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తొగర్‌పల్లి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమకు సంబంధించి శ్రీధర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పరిశ్రమ ప్రతినిధులతో పాటు కాంగ్రెస్ నాయకులపై ఆయన చేసిన విమర్శలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించడం వల్ల ఈ చర్య తీసుకున్నట్లు మల్లారెడ్డి వివరించారు. పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా వెళ్లినందుకే సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి శ్రీధర్ రెడ్డికి ఎటువంటి సంబంధం ఉండదని తేల్చి చెప్పారు. పార్టీ గౌరవాన్ని కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎవరినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# కవ్వాల్ గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించిన భక్తులు.. ఆధ్యాత్మిక శోభతో మురిసిన గ్రామం**



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో మూడు రోజుల పాటు సాగిన ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. గ్రామ దేవత ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణంలో వేసిన రంగురంగుల ముగ్గులు, ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. మట్టి కుండలను పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో బోనాలను నెత్తిన ఎత్తుకుని మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారితో పాటు ఇతర దేవతా మూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలతో కవ్వాల్ గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

### ముగిసిన ఉత్సవాలు

ఆలయ గోడలపై వేసిన ఆధ్యాత్మిక చిత్రపటాలు, శివుడు, గణేశుడు, ఇతర దేవతా మూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పెద్దలు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. మంగళవారం సాయంత్రం ముగింపు వేడుకల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ మొక్కుల పండుగ ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.



జనం పవర్ JANAM POWER
బుధవారం
13 మే 2026

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

**ఎన్నికల హామీలు అమలు చేయాలి**

**రూ. 6 వేల పింఛన్, ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి**

**దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం అధ్యక్షుడు కెమ్మసరం అశోక్**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**



రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలపై తక్షణమే స్పందించాలని తెలంగాణ దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం అధ్యక్షుడు కెమ్మసరం అశోక్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న ధరల కారణంగా దివ్యాంగులు వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. దివ్యాంగులకు నెలకు 6 వేల రూపాయల పింఛన్ అందించాలని ఆయన కోరారు. దాంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో తాను కళాకారుడిగా పాల్గొన్నానని తన హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. సమస్యలను పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం చర్చలకు రావాలని సమస్యలకు శాంతియుత పరిష్కారం చూపాలని నాయకులు కోరారు. తమ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా సహకారం అవసరమని అశోక్ పేర్కొన్నారు.

# తీర్మానం ఇవ్వడంలో జాప్యం.. సర్పంచ్ కు షోకాజ్ నోటీసు

**యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణంలో నిర్లక్ష్యం**

**వివరణ ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**



మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సోమన్‌పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల మల్లేష్ కు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి సంబంధించి గ్రామపంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో జాప్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చిందని కలెక్టర్ తెలిపారు. చెన్నూరు మండలం సోమన్‌పల్లి గ్రామ పంచాయతీలో పాఠశాల మంజూరు చేసి నిర్మాణానికి తగినంత నిధులను కూడా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అయితే పాఠశాల నిర్మాణానికి అవసరమైన తీర్మానం ప్రతిని పంపడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతున్నట్లు గుర్తించామని వివరించారు. ఈ విషయమై సరైన వివరణ కోరుతూ సర్పంచ్ కు నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సకాలంలో వివరణ అందజేయని పక్షంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 37(5) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యా పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని పేర్కొన్నారు..

# లేబర్ కోడ్‌లపై విద్యుత్ ఉద్యోగుల ఆగ్రహం!

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి**

**కేంద్ర ప్రభుత్వ గెజిట్ కాపీల దగ్ధం**

**రాష్ట్ర ప్రభుత్వం సవరణలు చేయాలని డిమాండ్**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా సిద్దిపేటలో విద్యుత్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సిద్దిపేట సర్కిల్ ఆఫీస్ వద్ద గెజిట్ కాపీలను దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం మే 8న లేబర్ కోడ్‌ల నిబంధనలను విడుదల చేయడాన్ని నేతలు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ఫలితాల అనంతరం వెంటనే ఈ నిర్ణయం తీసుకోవడం కార్మికులను వంచించడమేనని ఆరోపించారు. కార్మిక అంశాలు ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వాలు సవరణలు చేసే అవకాశం ఉందని సీఐటీయూ నేత గోపాలస్వామి పేర్కొన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేలా రాష్ట్ర అసెంబ్లీలో చట్టపరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ర్యాకం అశోక్, నేతలు నవీన్, సిద్ధంరాజు, కనకరాజు పాల్గొన్నారు. వీరితో పాటు సరిత, కిరణ్, బాబు, కరుణాకర్ తదితర ఉద్యోగులు పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐక్య కార్మిక ఉద్యమాల ద్వారానే హక్కులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. విద్యుత్ భవన్ గేట్ ముందు జరిగిన ఈ ఆందోళనతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

# మళ్లీ మంచి రోజులు వస్తాయి!

- రాని మూడు వారాల ఉపాధి కూలీ డబ్బులు
- ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఆవేదన
- మాజీ మంత్రి హరీష్ రావు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో మాజీ మంత్రి హరీష్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఉపాధి హామీ పనులు చేసినా మూడు వారాలుగా కూలీ డబ్బులు తమ ఖాతాల్లో జమ కాలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో వడ్లను బి గ్రేడ్ కింద నమోదు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లు ఎంతో సక్రమంగా జరిగేవని రైతులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ మళ్లీ మంచి రోజులు రావాలని కేసీఆర్ పాలన తిరిగి రావాలని రైతులు ఆకాంక్షించారు. గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు ఫ్యాక్టరీలకు ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తోందని వారు వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై స్పందించిన హరీష్ రావు ప్రజలకు మళ్లీ మంచి రోజులు వస్తాయని భరోసా ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోనే తిరిగి ప్రజా పాలన కొనసాగుతుందని రైతులకు ఉపాధి కూలీలకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి!

- గోదాముల్లో నిల్వ చేసి రైస్ మిల్లులకు తరలించాలి
- రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా గోదాముల్లో భద్రపరచాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చెన్నూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు గోదామును అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీల నుంచి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని సూచించారు. చెన్నూరు మండలం ఆస్నాద్, ఒత్కులపల్లెతో పాటు కోటపల్లి మండలం దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు త్వరగా నగదు చెల్లింపులు పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. హమాలీ సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. వర్షానికి తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి తెస్తే నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, తహసీల్దార్లు రాఘవేంద్ర, సనత్ పాల్గొన్నారు.

# ప్రయోగాత్మక విద్యతోనే విద్యార్థుల అభివృద్ధి!

**బట్టీ చదువులకు స్వస్తి చెప్పాలి**

**పాఠశాలలో నాణ్యమైన విద్య, క్రీడలకు ప్రాధాన్యత**

**రావూస్ స్కూల్ సీఈవో నితిన్ రావు**




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

బట్టీ చదువులకు బదులుగా ప్రయోగాత్మక విద్య ద్వారానే విద్యార్థులకు నిజమైన లబ్ధి చేకూరుతుందని రావూస్ సీబీఎస్సీ పాఠశాల సీఈవో నితిన్ రావు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాఠశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల అంటే కేవలం ఇరుకు గదుల్లో పాఠాలు చెప్పడం మాత్రమే కాదని, విద్యార్థులకు విశాల వాతావరణంలో విద్యను అందించడం ఎంతో ముఖ్యమన్నారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని నితిన్ రావు చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా లోక జ్ఞానాన్ని పెంపొందించేలా బోధన సాగుతోందన్నారు. భవిష్యత్తులో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని నితిన్ రావు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని వివరించారు. నాణ్యమైన విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# బండి 'భగీరథ' యత్నం ఫలించదు!

**చట్టం ముందు అందరూ సమానులే**

**మహిళా ఐపీఎస్ అధికారిణితో విచారణ**

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న 'హనీ ట్రాప్' వ్యవహారంపై రాజకీయ సెగలు రాజుకుంటున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ వ్యవహారాన్ని నైతికతకు, చట్టబద్ధతకు మధ్య జరుగుతున్న పోరాటంగా అభివర్ణించారు.

## నైతిక బాధ్యత వహించాలి

కేంద్ర హోం శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న బండి సంజయ్ తన ఇంట్లోనే జరుగుతున్న అరాచకాలను అరికట్టలేకపోవడం విచారకరమని బొజ్జు పటేల్ విమర్శించారు. ధర్మం గురించి మాట్లాడే సంజయ్ గారు తన కుమారుడు చేసిన పనికి సమాజానికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరగాలంటే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేసి విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు.

## ఐపీఎస్ అధికారిణితో దర్యాప్తు

ఈ కేసును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఎమ్మెల్యే వెల్లడించారు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా ఉండేందుకు ఒక మహిళా ఐపీఎస్ అధికారిని ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే భగీరథ్‌పై కేసు నమోదైందని చట్టం నుండి ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని భరోసా ఇచ్చారు.

## మహిళా రక్షణకు 'ఈగల్ టీమ్స్'

రాష్ట్రవ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి, అమ్మాయిలపై వేధింపులను పసిగట్టడానికి 'ఈగల్ టీమ్స్' నిరంతరం నిఘా ఉంచుతాయని వివరించారు. డ్రగ్స్ మహమ్మారి నుండి విద్యార్థులను, యువతను కాపాడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. నిజంగా బిజెపికి మహిళా రక్షణపై గౌరవం ఉంటే బండి సంజయ్‌ను పదవి నుండి తొలగించాలని సవాల్ విసిరారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని శిక్ష తప్పదని హెచ్చరించారు.

# ఇరాక్‌లో నిర్మల్ బిడ్డల నరకయాతన!

**ఏజెంట్ చేతిలో మోసపోయి బందీలుగా మారిన ఏడుగురు**

**తిండి, నీళ్లు లేక గ్లాస్ కంపెనీలో నరకం**



## కాపాడాలని ప్రభుత్వానికి బాధితుల వేడుకోలు

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఉన్న ఊరిలో ఉపాధి లేక, చేసిన అప్పులు తీర్చుకోవడానికి గల్ఫ్ వెళ్లిన ఏడుగురు యువకుల బతుకులు ఇప్పుడు ఇరాక్ లోని ఒక చీకటి గదిలో మగ్గిపోతున్నాయి. నిర్మల్ జిల్లా కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన సింగారి తిరుపతి, సింగారి శ్రీకాంత్, రత్నాల వెంకటేష్, మునేసుల వెంకటేష్, జక్కుల గంగాధర్, జక్కుల అనిల్, ఆడెపు రాకేష్ అనే యువకులు ఏజెంట్ మాయమాటలు నమ్మి నరకంలో చిక్కుకున్నారు. జగిత్యాలకు చెందిన బీఎంఆర్ ట్రావెల్స్ ఏజెంట్ ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసి, ఇరాక్ లోని ఆసుపత్రిలో ఏసీ గదుల్లో క్లీనింగ్ పని అని నమ్మించి గతేడాది నవంబర్ లో అక్కడికి పంపాడు. తీరా వెళ్ళాక వారిని ఒక ప్రమాదకరమైన గ్లాస్ కంపెనీకి అప్పగించారు.

### గాజు నరకంలో చిత్రహింసలు

అక్కడ పని చేస్తున్న క్రమంలో గ్లాస్ ముక్కలు దిగి శ్రీకాంత్ చేయి తీవ్రంగా గాయపడింది. నాలుగు కుట్లు పడి చేయి కదపలేని స్థితిలో ఉన్నా, కంపెనీ ఫోర్ మెన్ బూటు కాళ్లతో తన్నుతూ పనుల్లోకి లాక్కెళ్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి పంపమని వేడుకుంటే చంపేసి ఇక్కడే పాతిపెడతామంటూ తుపాకులతో బెదిరిస్తున్నారని వాపోతున్నారు. గత మూడు రోజులుగా పరిస్థితి మరింత భయానకంగా మారింది. కంపెనీ యాజమాన్యం ఆ ఏడుగురిని ఒక చిన్న గదిలో బంధించి, తాగడానికి నీళ్లు, తినడానికి తిండి కూడా ఇవ్వడం లేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### ప్రభుత్వానికి ఆర్తనాదం

"మమ్మల్ని కాపాడండి.. లేదంటే శవాలమై వస్తాం" అంటూ వారు సోషల్ మీడియా ద్వారా పంపిన వీడియోలు చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. తమ బిడ్డలను సురక్షితంగా ఇంటికి తీసుకురావాలని నిర్మల్ జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర విదేశాంగ శాఖను బాధితుల కుటుంబాలు వేడుకుంటున్నాయి. ఇరాక్ రాయబార కార్యాలయంతో మాట్లాడి వారిని విముక్తులను చేయాలని కోరుతున్నాయి. లక్షలు వసూలు చేసి యువకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న జగిత్యాల ఏజెంట్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# కోఠి మహిళా వర్సిటీలో సైన్స్ బ్లాక్ ప్రారంభం!

- ఆధునిక ల్యాబ్ లతో అందుబాటులోకి కొత్త భవనం
- మహిళా విద్యకు ప్రభుత్వం పెద్దపీట
- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, మే 12 (జనం పవర్):** హైదరాబాద్‌లోని చారిత్రాత్మక వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో (కోఠి ఉమెన్స్ కళాశాల) నూతనంగా నిర్మించిన సైన్స్ బ్లాక్‌ను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ భవనాన్ని జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు కాల్వ సుజాత, మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు.

### అత్యాధునిక సదుపాయాలు

మహిళా విద్యార్థినులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ బ్లాక్‌లో అత్యాధునిక ల్యాబ్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. కోఠి కళాశాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. కొత్త భవనాల నిర్మాణంతో విద్యార్థినులకు పరిశోధనా రంగంలో మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. మహిళా అభివృద్ధి, సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంగా మారిన తర్వాత మరిన్ని నిధులు, అధునాతన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ తో పాటు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా కళాశాలలో శుద్ధజలం ప్లాంట్ ప్రారంభం!

### ఎంపీ నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

### హామీ నిలబెట్టుకున్న ఎంపీ గోడం నగేష్



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆదిలాబాద్ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శుద్ధ జల ప్లాంట్‌ను ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం ప్రారంభించారు. గతంలో కళాశాలను సందర్శించిన సమయంలో విద్యార్థినులు, సిబ్బంది తాగునీటి సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినుల దాహార్తిని తీర్చడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని అప్పట్లో ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి 4.5 లక్షల రూపాయలు మంజూరు చేయించి ప్లాంట్‌ను సిద్ధం చేయించారు. ప్రారంభోత్సవం అనంతరం ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ద్వారా కళాశాలలోని విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ విద్యా సంస్థల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాటిపల్లి గంగాధర్ రావు, మాజీ రైల్వే బోర్డు సభ్యుడు జి.వి. రమణ హాజరయ్యారు. వీరితో పాటు స్థానిక నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో తమ తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్లాంట్ నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని కళాశాల యంత్రాంగానికి నేతలు సూచించారు.

# గంజాయి నియంత్రణకు పోలీసుల ఉక్కుపాదం!

### నార్కోటిక్ పరీక్షలో నలుగురికి పాజిటివ్

### నిందితులు డి-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాల నిర్మూలనతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురిని ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విచారించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహించారు.

### పాజిటివ్‌గా తేలిన నలుగురు

వైద్య పరీక్షల్లో నలుగురు వ్యక్తులు గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. ఎస్‌కే జమీర్, ఆర్. ఎమ్‌డీ తాజ్ బాబా, ఎస్‌కే కలీం, తోట మనీదీప్. నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేసిన పోలీసులు వారిని కోర్టు ముందు హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిని పదిహేను రోజుల పాటు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. మత్తుకు బానిసైన వారిలో మార్పు తీసుకురావడానికి, వారిని చెడు అలవాట్ల నుంచి దూరం చేయడానికి ఈ చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

### యువత భవిష్యత్తు నాశనం కావొద్దు

మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని సీఐ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రవాణా, నిల్వ లేదా వినియోగం వంటి అక్రమ పనులకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. మత్తు పదార్థాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.




# జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు అభినందనలు

### కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్ష

### ఉద్యోగుల సమస్యలపై సహకారం అందించాలని విజ్ఞప్తి



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దరిపల్లి చంద్రంను ఔట్సోర్సింగ్ జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కొత్త బాధ్యతల్లో ఆయన విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం తమ వంతు సహకారం అందించాలని కోరారు. దరిపల్లి చంద్రం కొత్త పదవిలో జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తారని జేఏసీ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజలకు, ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ జేఏసీ వైస్ ప్రెసిడెంట్ పోన్నమల్ల యాదగిరి, జేఏసీ చైర్మన్ పుల్లగుర్ల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ బలోపేతానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వారు తెలిపారు.

# టీజేఎస్ 4వ ప్లీనరీలో జిల్లా నేతల సందడి

### రాష్ట్ర అధ్యక్షుడిగా కోదండరాం ఏకగ్రీవ ఎన్నిక

### హైదరాబాద్ జలవిహార్‌లో ఘనంగా వేడుకలు



**సంగారెడ్డి, మే 12 (జనం పవర్):** హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించిన తెలంగాణ జన సమితి (టీజేఎస్) 4వ ప్లీనరీ సమావేశాలకు సంగారెడ్డి జిల్లా నాయకులు భారీగా తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు తుల్జరెడ్డి నాయకత్వంలో వివిధ మండలాల నుంచి ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కోదండరాం ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంపై జిల్లా నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కోదండరాంను జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణ సాధనలో, రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వంలో కలిసి పనిచేస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు, నాయకులు ఆశప్ప, శ్రీధర్ మహేంద్ర, జి. మల్లయ్య, హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. మహిళా విభాగం నుంచి ఆర్ లక్ష్మి, మానస, యువజన విభాగం నుంచి పాండు, పోలా విజయ్ కుమార్, శిరోమణి తదితరులు హాజరై ప్లీనరీని విజయవంతం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న టీజేఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కోదండరాం నాయకత్వంపై తమ మద్దతు ప్రకటించారు.

# 3 రోజుల్లోనే ధాన్యం డబ్బులు!

### 4 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

### 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు: జిల్లా కలెక్టర్ హేమావతి

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**



జిల్లాలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ హేమావతి తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లుల వద్ద అన్‌లోడింగ్, చెల్లింపుల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ (7995050809) ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రవాణా, సహకార, పౌరసరఫరాల శాఖల సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. గత రబీ సీజన్‌లో 90 వేల మంది రైతుల నుంచి 3.81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈసారి 4 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు 17 వేల మంది రైతుల నుంచి 1.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వివరించారు. ఇందులో 8 వేల మంది రైతుల ఖాతాల్లో ఇప్పటికే డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. అకాల వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పి రక్షించుకోవాలని సూచించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద 250 లారీలు, 200 ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు సొంత ట్రాక్టర్లతో రవాణా చేసినా బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ వేగవంతం చేసేందుకు అదనంగా 950 మంది హమాలీలను నియమించుకోవాలని మిల్లర్లకు సూచించారు. ట్రక్ షీట్లు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా రైతులకు మూడు రోజుల్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు రైతులు, మిల్లర్లు సహకరించాలని కోరారు.

# కిందిబజార్‌లో వైభవంగా హనుమాన్ జయంతి

**గజమాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు**

**ఆధ్యాత్మిక శోభతో మురిసిన సంగారెడ్డి**



**సంగారెడ్డి, మే 12 (జనం పవర్):** హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని కిందిబజార్‌లో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరిగాయి. అక్కడ వెలసిన పెద్ద హనుమాన్ విగ్రహానికి భక్తులు ప్రత్యేకంగా రంగులు వేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల సందడి మధ్య స్వామివారికి గజమాల అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో మున్సిపల్ కౌన్సిలర్ కొండాపురం జగన్ హాజరై భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పురోహితులు రాఘవేంద్ర శర్మ, ప్రకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కౌన్సిలర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనప్రియ రాజు, మధు గౌడ్, రవిశంకర్, శ్రీమాన్ మధు పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. జై హనుమాన్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. శాంతియుత వాతావరణంలో వేడుకలు ముగియడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి నా వంతు కృషి!

**బాధ్యతలు చేపట్టిన చైర్మన్ దరిపల్లి చంద్రం**

**సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు**

**పోటీ పరీక్షల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు**




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దరిపల్లి చంద్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నమ్మకంతో శ్రమించిన వారికి తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

గ్రంథాలయం అనేది ప్రతి విద్యార్థికి దేవాలయంతో సమానమని చంద్రం అభివర్ణించారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వీటి పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. జిల్లాలోని 17 గ్రంథాలయాల్లో చదువుకునే వారితో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఉన్నతమైన అవకాశాలు కల్పించే దిశగా తన వంతు ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి సూర్యవర్మ, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంద పాండు పాల్గొన్నారు. అలాగే శ్రీశైలం ముదిరాజ్ తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు చంద్రంను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయాల ఆధునీకరణకు అంతా కలిసికట్టుగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి!

- పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీసీపీ ఏ. భాస్కర్
- శాంతిభద్రతల పరిరక్షణకు విజిబుల్ పోలీసింగ్ ముఖ్యం
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జోన్ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ ఏ. భాస్కర్ సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు అధికారులు మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాలను ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రౌడీ షీటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు.

## విజిబుల్ పోలీసింగ్ తో నిఘా

పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిరంతరం నిర్వహిస్తూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని డీసీపీ సూచించారు. ప్రతి కానిస్టేబుల్ తమకు కేటాయించిన కాలనీలు, గ్రామాలను సందర్శించాలని ఆదేశించారు. అక్కడి ప్రజలు, యువతతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని సిబ్బందికి వివరించారు.

## అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం

రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని డీసీపీ తెలిపారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బాధితుల ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా తక్షణమే స్పందించి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తపాలాపూర్ టోల్ వద్ద స్థానికులకు ఊరట!

- డిజిటల్ టోల్ గేట్ అందుబాటులోకి
- స్థానిక వాహనాలకు ఉచిత ప్రయాణం
- ఎఫ్‌డీఓ రామ్మోహన్




**జన్నారం, మే 12 (జనం పవర్):** జన్నారం మండలంలోని తపాలాపూర్ వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన కొత్త డిజిటల్ టోల్ గేట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. అటవీ రక్షణే లక్ష్యంగా వెలిసిన ఈ టోల్ గేట్ వల్ల స్థానిక ప్రయాణీకులకు ఎంతో మేలు చేకూరనుంది. అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే వాహనాల డేటాను భద్రపరిచేందుకు ఈ అత్యాధునిక వ్యవస్థను తీసుకువచ్చారు. టోల్ గేట్ అంటేనే భయపడే సామాన్యులకు అటవీ శాఖ అధికారులు ఊరట కలిగించారు.

## స్థానికులకు ఉచిత ప్రయాణం

జన్నారం, దండేపల్లితో పాటు పరిసర మండలాల ప్రజలు తమ సొంత ప్రాంతాల్లో తిరగడానికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానికులు టోల్ ఫీజు నుంచి మినహాయింపు పొందాలంటే తమ ఆధార్ కార్డు, వాహన ఆర్సీ కాపీలను టోల్ వద్ద ఉన్న సిబ్బందికి అందజేయాలి. ఈ వివరాలను డిజిటల్ సిస్టమ్‌లో నమోదు చేసిన తర్వాత ఆటోమేటిక్ సెన్సార్లు వాహనాన్ని గుర్తించి ఉచితంగా దారినిస్తాయి. దీనివల్ల స్థానికులు క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా ప్రయాణం సాగించవచ్చు.

## అటవీ సంపద రక్షణే లక్ష్యం

అటవీ ప్రాంతంలోకి ఏ వాహనం వెళ్తుంది, ఎప్పుడు బయటకు వస్తుంది అనే అంశాలపై నిఘా ఉంచడమే ఈ గేట్ ప్రధాన లక్ష్యమని ఎఫ్‌డీఓ రామ్మోహన్ తెలిపారు. కేవలం ఫీజు వసూలు చేయడం తమ ఉద్దేశ్యం కాదని, అటవీ సంపద అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ టెక్నాలజీని వాడుతున్నామని చెప్పారు. అడవి బిడ్డలకు, స్థానికులకు అండగా ఉంటూనే అటవీ సంరక్షణను పటిష్టం చేస్తున్నామని వివరించారు. మంచిర్యాల జిల్లా సరిహద్దు మండలాల ప్రజలు తమ వాహన వివరాలను వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు.

# ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి!

- రెండు రోజుల్లో లోడింగ్ పూర్తి కావాలి
- కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



**మద్దూరు/గుండుమాల్, మే 12 (జనం పవర్):** కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యం బస్తాలను వెంటనే లోడింగ్ చేయించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. అలాగే రైస్ మిల్లర్లు కేంద్రాల నుంచి వచ్చిన లారీలను త్వరగా అన్‌లోడింగ్ చేయించాలని సూచించారు. మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్‌తో కలిసి మద్దూరు, పల్లెగడ్డ తండా, దొరేపల్లి, గుండుమాల్, అమ్లికుంట పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం సేకరణలో లోడింగ్, అన్‌లోడింగ్ జాప్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో కేంద్రాల్లో నిల్వ ఉన్న బస్తాల తరలింపు పూర్తి కావాలని స్పష్టం చేశారు.

## వాహనాల కొరత లేకుండా చర్యలు

మద్దూరు కేంద్రంలో లారీల కొరత వల్ల లోడింగ్ నిలిచిపోయినట్లు అధికారులు వివరించగా, కలెక్టర్ వెంటనే ఆర్టీవో మేనకా గాంధీతో మాట్లాడారు. మద్దూరు, గుండుమాల్, కోస్గి మండలాల్లో నిల్వ ఉన్న ధాన్యం తరలింపునకు వెంటనే వాహనాలు పంపాలని ఆదేశించారు. పల్లెగడ్డ తండా కేంద్రంలో బుధవారం సాయంత్రం లోపు లోడింగ్ పూర్తి చేయాలని సివిల్ సప్లై అధికారి సైదులుకు దిశానిర్దేశం చేశారు. దొరేపల్లి వద్ద బస్తాల తూకాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, వర్షాల దృష్ట్యా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.



## మిల్లుల వద్ద నిఘా

కోస్గి మండలంలోని మహాలక్ష్మి రైస్ మిల్లును సందర్శించి అన్‌లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. మిల్లుకు వచ్చిన లారీలను వెంటనే ఖాళీ చేసి తిరిగి కేంద్రాలకు పంపాలని యజమానికి సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి పని వేగవంతం చేయాలన్నారు. రానున్న పది రోజులు కొనుగోలు ప్రక్రియను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ లోడింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించాలని చెప్పారు.

## క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

అమ్లికుంట కేంద్రంలో పెద్ద వాహనాలు రాలేని పరిస్థితి ఉండటంతో ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం బస్తాలు మిల్లులకు చేరే వరకు తహసీల్దార్, వెహికల్ ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. అధికారులు తమ మండలాల్లోనే అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ఫోటోలను తనకు పంపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సైదులు, తహసీల్దార్లు మహేష్, భాస్కర్, బక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

